రహదారి పక్కన ధాన్యం ఆరబెడుతున్న రైతులు (ఫైల్)

ధాన్యం ఆరబోతకు అవస్థలు

కల్లాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు

ఉపాధి హామీలో కల్లాల నిర్మాణాన్ని నిలిపేసిన కేంద్రం

బొంరాస్‌పేట, ఏప్రిల్ 12 : ధాన్యం ఆరబెట్టడానికి కల్లాలు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. యాసంగి వరి కోతలు ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్నాయి. ఇంకొన్ని రోజుల్లో వ్యవసాయ బోర్లు, చెరువుల కింద వరి కోతలు ముమ్మరం కానున్నాయి. ఇప్పటి నుంచే ధాన్యం ఆరబోతకు అన్నదాతలు పడరాని పాట్లు పడుతున్నారు. యాసంగిలో వికారాబాద్ జిల్లాలో 85 వేల ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేయగా, 1.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. పొలాల్లో వరి కోతలు కోసిన తరువాత వచ్చిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి పొలాల్లో సరైన సదుపాయం లేక ఆందోళన చెందుతున్నారు. ధాన్యంలో తేమ శాతం 17కు మించరాదని ప్రభుత్వం చెబుతుంది. ఆరబెట్టకుండా కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లినా అక్కడ కూడా ఆరబెట్టడానికి సౌకర్యాలు లేవు. దీంతో రైతులు వచ్చిన ధాన్యాన్ని రోడ్లపైన, పొలాల్లో కొంత ఖాళీ స్థలాన్ని వదిలి అక్కడ, ఇండ్ల ఎదుట ఆరబోస్తున్నారు. రహదారులపై ధాన్యం ఆరబెడితే ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులు అడ్డుకుంటున్నారు. దీంతో వచ్చిన ధాన్యాన్ని ఎక్కడ ఆరబెట్టాలోనని అన్నదాతలు మథనపడుతున్నారు.

గతంలో ఇలా..

రైతులు పండించిన ధాన్యాన్ని పొలాల్లో ఆరబెట్టడానికి గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకంలో కల్లాల నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. రైతులకు ఇవి ఎంతో ఉపయోగపడుతాయన్న ఉద్దేశంతో ఎన్ని అడిగితే అన్ని మంజూరు చేశారు. 50 చదరపు అడుగుల కల్లం నిర్మాణానికి రూ. 56 వేలు, 60 చదరపు అడుగుల కల్లం నిర్మాణానికి రూ.68 వేలు, 75 చదరపు అడుగుల కల్లం నిర్మాణానికి రూ.85 వేలు ఖర్చు చేసేవారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వీటిని ఉచితంగానే నిర్మించేవారు. మిగిలిన వారికి 90 శాతం రాయితీతో కల్లాలను నిర్మించేవారు. వికారాబాద్ జిల్లాలో ఉపాధి హామీ పథకంలో 2 వేల వరకు కల్లాలను గతంలో నిర్మించారు. 2022 ఏప్రిల్ నుంచి కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో కల్లాల నిర్మాణానికి అనుమతి ఇవ్వకపోవడంతో బ్రేక్ పడింది. దీంతో వడ్ల ఆరబోతకు నానా యాతన అవుతున్నది. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టడానికి ప్లాట్‌ఫాంలు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని నిర్వాహకులు పరిశీలించి తేమ అధికంగా ఉన్నదని తిప్పి పంపిస్తుంటే రైతులకు దిక్కు తోచడం లేదు. ధాన్యం ఆరబోతకు ఎదురవుతున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించి ఉపాధి హామీ పథకం కింద తిరిగి కల్లాల నిర్మాణాన్ని ప్రారంభిస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు.

కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట

వడ్లు ఆరబెట్టాలంటే ఇబ్బందిగా ఉన్నది..

పండించిన ధాన్యాన్ని ఆరబెట్టాలంటే పొలాల్లో, కొనుగోలు కేంద్రాల వద్ద సరైన సౌకర్యాలు లేవు. కల్లాలు ఉంటే ధాన్యం ఆరబెట్టడానికి ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ఎక్కడ జాగా లేక రోడ్ల పక్కన, ఖాళీ స్థలాలు, ఇండ్ల ఎదుట ఆరబెడుతున్నాం. ఉపాధిహామీలో కల్లాల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలి.

– రవీందర్, రైతు మెట్లకుంట

కల్లాల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలి..

ఉపాధి హామీ పథకంలో గతంలో ఉన్నట్లు కల్లాల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వాలి. రెండేండ్ల నుంచి కల్లాల నిర్మాణానికి అనుమతి ఇవ్వకపోవడంతో రైతులు ధాన్యం ఆరబెట్టడానికి ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ప్రస్తుతం యాసంగి ధాన్యం దిగుబడి వస్తున్నందున ఆరబెట్టడం ప్రధాన సమస్యగా మారింది. కల్లాల నిర్మాణాన్ని పునరుద్ధరించాలి.

– శంకర్‌లింగం, రైతు, కొత్తూరు

కేటీఆర్‌ను కలిసిన సత్యనారాయణ

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను శుక్రవారం హైదరాబాద్ నగరంలోని ఆయన నివాసంలో కొత్తూరు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొత్తూరులో పార్టీ పరిస్థితిని మాజీ మంత్రి అడిగి తెలుసుకుని.. బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించినట్లు ఆయన చెప్పారు.

–కొత్తూరు, ఏప్రిల్ 12

శోభాయాత్రకు పటిష్ట భద్రత

ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయ జెండాలు, ప్రసంగాలకు చోటు లేదు

ఊరేగింపు రూట్‌ను పరిశీలించిన నగర సీపీ

సిటీబ్యూరో, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): శ్రీ రామ నవమి శోభాయాత్రకు సిటీ పోలీసుల ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని, నిర్వాహకులు పోలీసులకు సహకరించి పండుగను ప్రశాంతమైన వాతావారణంలో జరుపుకోవాలని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శ్రీరామ నవమి వేడుకలకు సంబంధించి శుక్రవారం మంగళ్‌హాట్ సీతారాంబాగ్‌లోని ద్రౌపది గార్డెన్స్‌లో ఉత్సవ సమితి సభ్యులు, వివిధ ప్రభుత్వ విభాగాలు జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బీ, విద్యుత్ తదితర శాఖలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. శ్రీరామ నవమి ఊరేగింపు జరిగే 6.8 కిలోమీటర్ల మార్గాన్ని పరిశీలించారు. శోభాయాత్ర ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో శోభాయాత్రలో రాజకీయ జెండాలు, రాజకీయ ప్రసంగాలు లేకుండా చూసుకోవాలని సీపీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నగర అదనపు సీపీ విక్రమ్ సింగ్ మాన్, అదనపు సీపీ సత్యనారాయణ, జీహెచ్ఎంసీ జోన్ కమిషనర్ హేమంత్ సహదేవ్‌రావు, డీసీపీలు, ఇతర శాఖల అధికారులతో పాటు ఉత్సవ సమితి సభ్యులు భగవంతరావు, కృష్ణ, ఆనంద్ సింగ్, గోవింద్‌రాఠీ కిరోడి మాల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్రీరామ నవమి వేడుకలు, శోభాయాత్ర నేపథ్యంలో తీసుకోవాల్సిన బందోబస్తు ఏర్పాట్లపై నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి నగర పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శోభాయాత్ర సీతారాంబాగ్ ఆలయం వద్ద ప్రారంభమై హనుమాన్ వ్యాయమ శాల వరకు కొనసాగుతుందని, ఈ ర్యాలీకి నగరంతో పాటు రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ల నుంచి వచ్చే ర్యాలీలు కలుస్తాయని సూచించారు. సీనియర్ పోలీసు అధికారుల పర్యవేక్షణలో ఎస్‌హెచ్‌వోలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సీపీ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు.

శోభాయాత్ర మార్గాన్ని పరిశీలిస్తున్న నగర సీపీ శ్రీనివాస్‌రెడ్డి

జూలై 8,9 తేదీల్లో ఏఐ సమ్మిట్

సిటీబ్యూరో, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీపై తెలంగాణ ప్రభుత్వం గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నది. రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్(ఐటీఅండ్ ఈసీ) శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ గ్లోబ్ ఏఐ సమ్మిట్‌ను చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ) వేదికగా జూలై 8-9 తేదీల్లో నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

స్పాన్సర్ల మద్దతు ఉంటే..

అద్భుత క్రీడాకారులు వెలుగులోకి

ఏసీబీ డీజీ సీవీ ఆనంద్

బంజారాహిల్స్, ఏప్రిల్ 12 : మన దేశంలో క్రికెట్‌కు ఉన్న ఆదరణ ఇతర క్రీడలకు లేకపోవడంతోపాటు ఆయా క్రీడాకారులు ఆర్థిక వనరుల కోసం ఇబ్బంది పడే పరిస్థితులుండడం బాధాకరమని ఏసీబీ డైరెక్టర్ జనరల్ సీవీ ఆనంద్ అన్నారు. ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో ఏఫ్ఎన్‌సీసీ ఓపెన్ టెన్నిస్ పురుషుల విభాగం టోర్నమెంట్ విజేతలకు బహుమతి ప్రదానం కార్యక్రమాన్ని టెన్నిస్ క్రీడాకారిణి సానియా మిర్జాతో కలిసి హాజరై మాట్లాడారు. ప్రతిభ ఉన్నా..చాలామంది టెన్నిస్, ఇతర క్రీడల్లో ఆర్థిక స్థోమత లేక అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనలేకపోతున్నారన్నారు. ఐపీఎల్ తరహాలో ఇతర క్రీడలకూ స్పాన్సర్ల మద్దతు దొరికితే అనేక మంది అద్భుత క్రీడాకారులు వెలుగులోకి వస్తారన్నారు. స్పాన్సర్లు క్రికెట్‌కు ఇచ్చిన ప్రాధాన్యాన్ని ఇతర క్రీడలకు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. అనంతరం సానియామిర్జా మాట్లాడుతూ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లేందుకు డబ్బులు లేక చాలామంది క్రీడాకారులు ఆటలకు దూరమవుతున్నారన్నారు. కార్యక్రమంలో ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ అధ్యక్షుడు ఆదిశేషగిరిరావు, స్పోర్ట్స్ కమిటీ చైర్మన్ చాముండేశ్వరినాథ్, కార్యదర్శి ముళ్ల పూడి మోహన్, మాజీ అధ్యక్షుడు కేఎల్ నారాయణ, మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజేతకు బహుమతిని అందజేస్తున్న సానియా మిర్జా, చిత్రంలో సీవీ ఆనంద్

పైగా ప్యాలెస్‌లోకి హెచ్ఎండీఏ

లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రధాన కార్యాలయం

సిటీబ్యూరో, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): చారిత్రాత్మక వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందిన బేగంపేటలోని పైగా ప్యాలెస్‌ను హెచ్ఎండీఏ ప్రధాన కార్యాలయంగా మార్చే ప్రక్రియ మొదలైంది. హెచ్ఎండీఏ కార్యకలాపాలన్నీ ఒకే చోట నుంచి జరిగేలా చేయాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా జీవోను జారీ చేసింది. ప్రస్తుతం హెచ్ఎండీఏకు సంబంధించిన కార్యకలాపాలు అమీర్‌పేట, నానక్‌రాంగూడ, హుస్సేన్‌సాగర్ లుంబినీ పార్కు ప్రాంతాల నుంచి జరుగుతున్నాయి. వీటన్నింటినీ బేగంపేటలోని పైగా ప్యాలెస్‌లోకి మార్చేందుకు హెచ్ఎండీఏ ఇంజినీరింగ్ విభాగం అధికారులు చర్యలు చేపట్టారు. వారం రోజులుగా పైగా ప్యాలెస్‌లో ఉన్న భవనాలు, అక్కడ ఇప్పటికే ఉన్న మౌలిక వసతులను పరిశీలిస్తున్నారు. ఎలక్ట్రిక్ విభాగంతో సహా ఐటీ, నెట్‌వర్కింగ్‌కు సంబంధించిన ఉద్యోగులు అక్కడి భవనాల్లో ఉన్న వనరులను గుర్తించే పనిలో ఉన్నారు. సుమారు లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో హెచ్ఎండీఏకు సంబంధించిన అన్ని కార్యకలాపాలు ఒకే చోట నుంచి జరిగేలా అవసరమైన మౌలిక వసతులను కల్పించనున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం దీనికి సంబంధించిన ప్రత్యేకంగా జీవోను సైతం జారీ చేయడంతో అధికారులు ఈ నెలాఖరు వరకు అందులో ఆఫీసు నిర్వహణకు అవసరమైన ఫర్నిచర్, వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారుల చాంబర్‌లు, వాటికి అవసరమైన మౌలిక వసతులపై నివేదికను రూపొందించనున్నారు. ఈ భవనం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానికి చెందినది కావడంతో దాన్ని సమర్థవంతంగా వినియోగించుకునేందుకు ఎలాంటి అదనపు నిర్మాణాలు చేపట్టాలన్న దానిపైనా ఇంజినీరింగ్ విభాగం అధికారులు అధ్యయనం చేస్తున్నారు. కాగా, ఆగస్టు నాటికి హెచ్ఎండీఏ కార్యాలయాల తరలింపు ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని ముద్రించి..

₹500 నకిలీ నోట్ల చెలామణి

ఇద్దరి అరెస్టు.. రూ.6.62 లక్షల నోట్లు స్వాధీనం

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 12 : రూ. 500 నకిలీ నోట్లు చెలామణి చేస్తున్న ముఠాను శంషాబాద్ ఎస్‌వోటీ, మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు పట్టుకున్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని ఉండాల్సిన నోట్లపై చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని ముద్రించి.. మార్కెట్‌లోకి అక్రమంగా నకిలీ నోట్లను చెలామణి చేస్తున్న ఇద్దరు నిందితుల నుంచి రూ. 6.62 లక్షల విలువ చేసే ఫేక్ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ మధు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లా పుంగనూరు పట్టణానికి చెందిన గంగరాజు, అభినందన్‌లు.. మహారాష్ట్రకు చెందిన సచిన్ పవార్, సురేశ్ పవార్ ఫేస్‌బుక్‌లో పోస్టు చేసిన నకిలీ కరెన్సీ వీడియోను చూసి వారిని సంప్రదించారు. వారి వద్ద నమూనాగా 10 నకిలీ నోట్లను కొనుగోలు చేశారు. సికింద్రాబాద్‌లో ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన లక్కీ అనే వ్యక్తికి ఐదు నోట్లను ఇచ్చి మార్కెట్‌లో మార్పిడి చేయించారు. సులభంగానే మారుతున్నాయని గ్రహించి.. గంగరాజు 3.5 లక్షలు పోగు చేసుకొని బెంగళూరు, సూరత్, నందుర్‌బార్ మీదుగా మహారాష్ట్రలోని చద్వేల్‌కు చేరుకున్నారు. అక్కడ సచిన్ పవార్, సురేశ్ పవార్‌లను కలిసి 17 లక్షల నకిలీ నోట్లను తీసుకొని 3.5 లక్షలు (1:5 నిష్పత్తి) చెల్లించారు. సికింద్రాబాద్‌లోని ఓ లాడ్జిలో బస చేశారు. మల్కాజిగిరిలోని సాయిరాం థియేటర్ సమీపంలో నరేశ్ అనే వ్యక్తి సాయంతో బైక్‌ను అద్దెకు తీసుకొని నకిలీ నోట్లను విక్రయించేందుకు మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మెహిఫిల్ రెస్టారెంట్‌కు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు గంగరాజు, అభినందన్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నకిలీ నోట్ల ను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బల్దియా.. బస్తీ కార్యాచరణ

స్వచ్ఛ హైదరాబాద్ లక్ష్యంగా చర్యలు

జీహెచ్ఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో బస్తీ కార్యాచరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

సిటీబ్యూరో, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బస్తీ కార్యాచరణను అమలు చేస్తున్నారు. మహా నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు బస్తీ స్థాయి నుంచే పారిశుద్ధ్య సిబ్బంది సమర్థవంతంగా పనిచేసేలా బస్తీ కార్యాచరణను ప్రారంభించారు. ప్రతి రోజు చెత్త సేకరణ 100 శాతం జరిగేలా చూసేలా ఉన్నతాధికారులకు జీహెచ్ఎంసీ ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేసింది. ఇంటింటికీ వెళ్లి వంద శాతం చెత్త సేకరణ చేసే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు బస్తీ కార్యాచరణను అమలు చేస్తున్నారు. ఇందులో వారం రోజుల్లో వివిధ అంశాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. మొదటి రోజు బస్తీ మీటింగ్, రెండో రోజు సాట్ వాహనాలకు అనుసంధానం చేయని ఇళ్లను గుర్తించడం, మూడవ రోజు బస్తీల్లో ర్యాలీలు నిర్వహించడం, 4వ రోజు చెత్త సేకరణ, పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించి, 5వ రోజు గుర్తించిన ప్రాంతాల్లో రంగోలి వేయడం, 6వ రోజు టౌన్ వెండింగ్ కమిటీ మీటింగ్, 7వ రోజు ముగింపు సందర్భంగా అధికారులు, పారిశుద్ధ్య విభాగం సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించేలా కార్యాచరణను రూపొందించారు. జీహెచ్ఎంసీ పరిధిలో 100 శాతం ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ చేసి, రోడ్లపై ఎక్కడ చెత్తాచేదారం వేసేందుకు అవకాశం లేకుండా చేయడమే లక్ష్యంగా దీన్ని నిర్వహించనున్నారు. ఇందులో శుక్రవారం జీహెచ్ఎంసీ పరిధిలో మొదటి రోజు 1604 ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించామని అధికారులు తెలిపారు. ఇందులో స్వయం సహాయక సంఘాల సభ్యులతో పాటు చెత్త సేకరించే ఆటోల డ్రైవర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటికే భద్రాద్రి సీతారాముల కల్యాణ తలంబ్రాలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ) : భద్రాద్రి సీతారాముల కల్యాణ తలంబ్రాలను భక్తులకు అర్బీనీ లాజిస్టిక్స్ ద్వారా అందిస్తామని గ్రేటర్ హైదరాబాద్ జోన్ డిప్యూటీ సీటీఏ మధుసూదన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.151 చెల్లించి వివరాలు నమోదు చేసుకుంటే తలంబ్రాలను చిరునామాలకు చేరుస్తామని తెలిపారు. ఈ నెల 18వ తేదీ వరకు బుకింగ్ చేసుకునే అవకాశం ఉందని వివరించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ రీజియన్‌లో 90 లాజిస్టిక్ కేంద్రాల్లో బుకింగ్ సౌకర్యం కల్పించినట్టు తెలిపారు. మరింత సమాచారం కోసం 9154298736, 9154298827 నంబర్లను సంప్రదించాలని కోరారు.

డబ్ల్యూపీవో అంబాసిడర్‌గా చక్రవర్తి

ఖైరతాబాద్, ఏప్రిల్ 12 : వరల్డ్ ప్యాకేజింగ్ ఆర్గనైజేషన్ గ్లోబల్ అంబాసిడర్‌గా కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) తెలంగాణ ఫార్మా, లైఫ్ సైన్సెస్ సభ్యులు చక్రవర్తి ఏవీపీఎస్ ఎంపికయ్యారు. ఫార్మాస్యూటికల్ మ్యానుఫాక్చరింగ్, ప్యాకేజింగ్ విభాగంలో అపార అనుభవం ఉన్న చక్రవర్తి ప్రపంచ వ్యాప్తంగా భారత ఫార్మా రంగం విస్తరించేందుకు విశేషంగా కృషి చేశారు. ఫార్మా రత్న, యూఎంబీ, ప్యాకేజింగ్ లీడర్‌షిప్ తదితర అవార్డులను కూడా ఆయన అందుకున్నారు.

ఖనిజ సంపదను వెలికితీయాలి

శిక్షణ పూర్తి చేసుకున్న భూవైజ్ఞానిక శాస్త్రవేత్తలతో జీఎస్ఐ సౌథెర్న్ రీజియన్ డైరెక్టర్ జనరల్ జనార్దన్‌ప్రసాద్ తదితరులు

మన్సూరాబాద్, ఏప్రిల్ 12 : శిక్షణ సమయంలో నేర్చుకున్న విజ్ఞానంతో దేశంలోని ఖనిజ సంపదను వెలికి తీసేందుకు భూవైజ్ఞానిక శాస్త్రవేత్తలు కృషి చేయాలని జీఎస్ఐ సౌథెర్న్ రీజియన్ డైరెక్టర్ జనరల్ జనార్దన్‌ప్రసాద్ తెలిపారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా రిక్రూట్ చేయబడి ఎల్బీనగర్, బండ్లగూడలోని జీఎస్ఐటీఐలో శిక్షణ పొందిన 47వ బ్యాచ్‌కు చెందిన 84 మంది భూవైజ్ఞానిక శాస్త్రవేత్తల ఓరియంటేషన్ కోర్సు ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం జీఎస్ఐటీఐ ప్రాంగణంలోని ఎంఎస్ కృష్ణన్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. జీఎస్ఐ సౌథెర్న్ రీజియన్ డైరెక్టర్ జనరల్ జనార్దన్‌ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హెడ్‌మిషన్-వీ డాక్టర్ మాథ్యూజోసెఫ్ హాజరై శిక్షణ పొందిన ట్రైనీ అధికారులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా జనార్దన్ ప్రసాద్ మాట్లాడుతూ దేశంలోనే జీఎస్ఐ అత్యుత్తమ జియోసైన్స్ ఆర్గనైజేషన్ అని కొనియాడారు. కార్యక్రమంలో డైరెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ప్రజాసంబంధాల అధికారి మల్లేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఏఐపై శిక్షణ

సిటీబ్యూరో, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ) : ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన, భారత ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ఇంజినీరింగ్ స్టాప్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లర్నింగ్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం కళాశాల విద్యార్థులకు ఏఐ, ఎంఎల్‌లకు సంబంధించిన అంశాలపై నిపుణులు శిక్షణ నిచ్చారు. నగరంలోని వివిధ కళాశాలల నుంచి 200మంది ఇంజినీరింగ్ విద్యార్థులు హాజరయ్యారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ రామేశ్వర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో జోగినపల్లి భాస్కర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ నుంచి ఏఐ, ఎంఎల్ అసోసియేట్ ప్రొఫెసర్ మరియా శాంతి, దుర్గా భవాని, ఈఎస్‌సీఐ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ సెల్ హెడ్ పి.సాయికిశోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

టీ-హబ్‌లో వైఎఫ్ఎల్‌వో కార్యక్రమంలో పాల్గొన్న మహిళా ప్రముఖులు

మూస పద్ధతులను వీడాలి

కొండాపూర్, ఏప్రిల్ 12 : మూస పద్ధతులను వీడాలని యంగ్ ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (వైఎఫ్ఎల్‌వో) ఆధ్వర్యంలో నాలెడ్జ్ సిటీలోని టీ-హబ్‌లో విమెన్ ఇన్ స్పోర్ట్స్, అన్‌స్క్రీన్, బియాండ్ అనే అంశాలపై పలువురు మహిళా ప్రముఖులతో వైఎఫ్ఎల్‌వో చైర్‌పర్సన్ రిధి జైన్ చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ ట్రావెలర్, ఫ్యాషన్ డిజైనర్ డాక్టర్ మారల్ యూజర్లూ, సీజన్డ్ డెజర్ట్ మారథాన్ ఎంఎస్ మిచెల్ కకడే, లిమ్కా అండ్ గిన్నిస్ బుక్ హోల్డర్, మాజీ ఒలింపియన్, టేబుల్ టెన్నిస్ చాంపియన్ నేహా అగర్వాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, అధిగమించాల్సిన సవాళ్లు, మారుతున్న పరిస్థితులు, అవకాశాలు తదితర విషయాలపై చర్చించారు.